ప్రజాశక్తి
ఆదివారం 6 అక్టోబరు, 2024



ఇకెవైసి అయితేనే లబ్ధి

వ్యవసాయ శాఖ జెడి త్రినాథస్వామి

ప్రజాశక్తి- ఆమదాలవలస

రైతులకు పిఎం కిసాన్ పథకం వల్ల ఐదేళ్లుగా అర్హులైన రైతులకు లబ్ధిచేకూరుతుందని వ్యవసాయశాఖ జెడి త్రినాథస్వామి అన్నారు. మండలంలోని దూసి రైతు సేవా కేంద్రంలోని రైతుల సమక్షంలో పిఎం కిసాన్ 18వ విడత నిధులు విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని శనివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తక్షణమే ఇకెవైసి చేయించుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బగ్గు రజిని మాట్లాడుతూ ఈ సంవత్సరం ఖరీఫ్ ఈ పంటలో పంట నమోదుకు సంబంధించి ఇకెవైసి ఎవరిదైనా పెండింగ్ ఉన్నట్లయితే ఈ నెల 7లోగా నమోదు చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మెట్ట మోహనరావు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ తమ్మినేని అలేఖ్య పాల్గొన్నారు.

ధరల దరువు

కన్నీరుపెట్టిస్తున్న ఉల్లి



టమాటా - 80
బంగాళ - 40
వంకాయ - 60
ఉల్లిపాయలు - 60
బెండ - 40
దొసకాయ - 25
కాకర - 40
క్యారెట్ - 60
అంగాకర కాయలు - 80

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు రెండు నెలలుగా పెరుగుతునే ఉన్నాయి. ఎక్కువ మంది వినియోగించే టామాటా ధర రైతు బజార్లలో కిలో రూ.60 వరకు పలుకుతున్నా... మార్కెట్‌లో రూ.70-80 వరకు అమ్ముతున్నారు. గత నెలలో కురిసిన వర్షాలకు కూరగాయల బహిర మార్కెట్‌లో తోటలు దెబ్బతినడంతో దిగుబడి తగ్గింది. ఇతర రాష్ట్రాల నుంచి కూడా దిగుబడులు రావడం లేదు. మరోవైపు రాష్ట్రంలో కూరగాయల సాగు కూడా పెరగడం లేదు. ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతోంది. నీటి సరఫరా సక్రమంగా ఉండే ప్రాంతాల్లో కూడా కూరగాయల సాగు తగ్గుతుంది. ప్రస్తుతం అన్నిరకాల కూరగాయలు కిలో రూ.50కి తగ్గడం లేదు. సాధారణ మార్కెట్లలో దొండ, వంకాయ, బెండ, కాకర, బీర, క్యారెట్, ఇతర దుంపలు తదితర రకాలు కిలో రూ.40 నుంచి రూ.50పైనే ఉన్నాయి. రైతుబజార్లలో మాత్రం రూ.35 నుంచి 40 మధ్య విక్రయిస్తున్నారు. ఆకు కూరలన్నీ రెండు కట్టలు రూ.20 వరకు పలుకుతున్నాయి. ఉల్లిపాయలు రైతు బజార్లలో రూ.54 నుంచి రూ. 56 వరకు ఉండగా బహిరంగ మార్కెట్‌లో రూ.60 నుంచి 70 వరకు అమ్ముతున్నారు. క్యారెట్ కొంత కాలంగా కిలో రూ.50 నుంచి రూ.60కు విక్రయిస్తున్నారు. కూరల్లో నిత్యా వసరమైన ఉల్లి ధర ఆకాశాన్నంటుతోంది. రైతుకు మాత్రం గిట్టుబాటు ధర లేక ధర పడి పోయిందని రైతులు గగ్గోలు పెడుతుంటే... మార్కెట్లో మాత్రం కొనే పరిస్థితి లేదు. పొట్టి శ్రీరాములు మార్కెట్‌తో పాటు రైతుబజారు ఇతర పట్టణ ప్రాంతాల్లో ఉల్లి వ్యాపారం జోరుగానే సాగుతోంది. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, కర్నాటక రాష్ట్రాలతో పాటు రాష్ట్రంలోని కర్నూలు, ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి పెద్ద మొత్తంలో ఉల్లి మార్కెట్‌కు దిగుమతి అవుతుంది. స్థానిక మార్కెట్లకు ఉల్లి చేరగానే దళారులంతా సిండికేట్‌గా ఏర్పడి మార్కెట్లలో వారికి నచ్చిన ధరకు అమ్ముతున్నారు. సోలాపూర్ ఉల్లి అంటూ వీధుల్లో వచ్చే వారు సైతం కిలో రూ.70కి విక్రయిస్తున్నారు. రైతులకు రూ.17 మాత్రమే చెల్లించి అక్కడి నుంచి జిల్లాలోని వివిధ మార్కెట్లకు ఉల్లి తీసుకొస్తున్నారు. రవాణా ఛార్జీలు, ఇతర నష్టాలను కలుపుకుని గతేడాది ఈ సీజన్‌లో రూ.25 నుంచి 30 వరకు ధర ఉండేది. కానీ, ఈ ఏడాది మాత్రం రవాణా రూ.వేలు వెచ్చించి వెచ్చిస్తూ ధరలను ఏక మొత్తంలో పెంచేశారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో దళారులు ఆడిందే ఆట పాడిందే పాటగా మారింది. జిల్లా అవసరాల కోసం హోల్‌సేల్ మార్కెట్లకు రోజుకు 25 టన్నుల లారీలు 10 వరకు వస్తున్నాయి. వచ్చిన ఉల్లిని హోల్‌సేల్ ధర కేజీ రూ.50 నుంచి రూ.60గా వ్యాపారులు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్ ధర కేజీ రూ.60 నుంచి రూ.70 మధ్య ఉంది. దీంతో సామాన్య ప్రజలు ఉల్లి తినలేని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

వేతన బకాయిలు చెల్లించాల్సిందే

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్



ధర్నా నిర్వహిస్తున్న విఒఎలు

వెలుగు సంస్థలో పనిచేస్తున్న విఒఎలకు బకాయి వేతనాలు చెల్లించాలి, అక్రమ రాజకీయ తొలగింపులు, వేధింపులు ఆపాలని విఒఎల సంఘం యూనియన్ గౌరవాధ్యక్షులు అల్లు మహలక్ష్మి, ప్రధాన కార్యదర్శి జి.అసిరినాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, కార్యదర్శి ఎ.వి.రమణలు డిమాండ్ చేశారు. విఒఎల సంఘం, సిఐటియు ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ముందుగా ఆర్‌అండ్‌బి బంగ్లా నుంచి కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలవారీ జీతాలు లేక విఒఎలు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఎప్పుడు జీతాలు వస్తాయో? తెలియని స్థితిలో విఒఎలు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రభుత్వాలు మారుతున్న ప్రతిసారీ విఒఎలపై రాజకీయ వేధింపులు మొదలై అక్రమ పద్ధతిలో తొలగిస్తున్నారని అన్నారు. దీనివల్ల వారికి ఉద్యోగ భద్రత కొరవడుతోందన్నారు. మారిన ప్రభుత్వాల వల్ల విఒఎల బతుకులు మారతాయని ఆశపడినా నెరవేరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలంగా ప్రభుత్వాలకు, ప్రజలకు మధ్య అనుసంధానంగా పనిచేస్తూ ప్రభుత్వ పథకాలు అందించడంలో కీలకంగా ఉన్నారని అన్నారు. అటువంటి వారిని తొలగించడం సరికాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విఒఎల సమస్యల పరిష్కరించకపోతే దశల వారీ ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సెర్ప్ హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడంతో పాటు 15 సంఘాల లోపు ఉన్న వారికి వేతనాలు చెల్లించాలన్నారు. విఒఎలకు రూ.10 లక్షల గ్రూప్ ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలన్నారు. మహిళా మార్టుల్లో సరుకుల కొనుగోలుకు బలవంతపు లక్ష్యాలు ఇచ్చే పద్ధతి రద్దు చేయాలని డిమాండ్ చేశారు. యాప్ నిర్వహణకు నెట్ మొబైల్ ప్రభుత్వమే ఇవ్వాలన్నారు. వేతనాల చెల్లింపు చెక్కులపై సిసి, ఎపిఎం సంతకాలు లేకుండా చూడాలన్నారు. అనంతరం డిఆర్‌డిఎ పిడి పి.కిరణ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. సమస్యల పరిష్కారానికి ఆయన సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు డి.జోగారావు, జి.యర్రయ్య, జి.శ్రీనివాసరావు, ఎస్.శంకర్, జయంతి, అనురాధ, గంగయ్య, రాజ్యలక్ష్మి, అప్పారావు పాల్గొన్నారు.

అందని ద్రాక్షగా ఇసుక



రణస్థలం : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- రణస్థలం

ఉచిత ఇసుక హామీ జిల్లాలో అందని ద్రాక్షగానే మిగిలిపోయిందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అందరికీ ఇసుక అందుబాటులోకి తేవాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు, సిపిఎం నాయకులు వెలమల రమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు రామతీర్థాలు కూడలి వద్ద శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇసుకను ఉచితంగా ఇస్తామంటూ ఇచ్చిన హామీని తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అవినీతిని అరికట్టి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి చూపాలని, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించాలని అన్నారు. భవన నిర్మాణాలు చేసుకునే వారిపై అధిక భారం లేకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక సక్రమంగా లభించకపోవడం, రేట్లు పెరిగిపోవడం, విచ్చలవిడి అవినీతి వల్ల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఏర్పడిందని పేర్కొన్నారు. అనేక కారణాలతో పాటు ఇసుక సమస్యపై ఆగ్రహంతో వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించారని, ఉచితంగా ఇసుక ఇస్తామని హామీ ఇచ్చి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని తెలిపారు. వంద రోజుల పాలనలో ఇసుక విషయంలో గత ప్రభుత్వానికి ఈ ప్రభుత్వానికి తేడా లేకుండాపోయిందని అన్నారు. అనేకచోట్ల ఇసుక లభించడం లేదని, రవాణా ఛార్జీలు, ఇతర పేర్లు చెప్పి ఇసుక రేట్లు తగ్గించలేదని తెలిపారు. కొన్నిచోట్ల మరింత పెరిగాయని, ఇసుక అక్రమ రవాణా కొనసాగుతున్నదని, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీ నేతలు పలుచోట్ల ఇసుకపై పెత్తనం చేస్తున్నారని పేర్కొన్నారు. బ్లాకులో ఇసుకను ధర విపరీతంగా పెంచి అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి పదేపదే బహిరంగంగా హెచ్చరిస్తున్నా... పరిస్థితిలో మార్పు రాలేదని అన్నారు. ఇసుక కొరత, అధిక రేట్ల వల్ల భవన నిర్మాణరంగం ఇబ్బందులు ఎదుర్కొంటోందని, భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కొరవడుతోందని, ఇళ్ల నిర్మాణాలు చేసుకునే పేదలపై భారం పడుతుందని వివరించారు. ఇసుక ఆన్‌లైన్ విధానం ప్రవేశపెడుతున్నామని ప్రకటించించినా ప్రభుత్వ ప్రకటనలకు, హామీలకు, ఆచరణకు పొంతనలేదని, ధరల్లో తీవ్ర వ్యత్యాసం కనబడుతోందని తెలిపారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఇజ్జురోతు రమణ, భవన నిర్మాణ కార్మికులు పి.చిన్న, పి.రామకృష్ణ, గొర్లె అప్పలనాయుడు పాల్గొన్నారు.



కొత్తూరు : ధర్నా చేస్తున్న సిపిఎం నాయకులు

కొత్తూరు : ఉచిత ఇసుక హామీని తక్షణమే అమలు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంగరాపు సింహాచలం, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు నిమ్మక అప్పన్న, తెల్లన్న, కార్మిక సంఘ నాయకులు రమణ, అప్పన్న, రమేష్, రామారావు, ప్రకాష్ పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 94 దరఖాస్తులు

శ్రీకాకుళం ప్రతినిధి : మద్యం దుకాణాలకు శనివారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. జిల్లాలోని 12 ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో 94 అప్లికేషన్లు వచ్చాయి. జిల్లాలోని 158 దుకాణాలకు ఇప్పటి వరకు 69 షాపులకు దరఖాస్తులు చేరాయి. ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీన గెజిట్ వెలువరించిన తర్వాత ఇప్పటివరకు మొత్తం 147 దుకాణాలకు దరఖాస్తులు వచ్చాయి. శ్రీకాకుళం మున్సిపాలిటీ పరిధిలోని 14 దుకాణాలకు శనివారం అత్యధికంగా 29 దరఖాస్తులు చేరాయి.


ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

మంత్రి, కలెక్టర్‌ను కలిసిన ఆర్‌డిఒలు


ఆర్‌డిఒలతో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్, టెక్కలి, కోటబొమ్మాళి

శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలుగా నియమితులైన కె.సాయి ప్రత్యూష, ఎం.కృష్ణమూర్తిలు వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంతో మంత్రి, శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌ను కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు. అలాగే కలెక్టరేట్‌లోని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌ను కూడా మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలను అందజేశారు.

2023 గ్రూప్-1 బ్యాచ్‌కు చెందిన వీరు ఇటీవలే శిక్షణ పూర్తి చేసుకుని తొలిసారి ఆర్‌డిఒలుగా నియమితులయ్యారు. టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి ఎంటెక్ పట్టభద్రులు. ఆయన గతంలో పోలీసుశాఖలో ఎస్‌ఐగా పదేళ్లపాటు పనిచేశారు. శ్రీకాకుళం ఆర్‌డిఒ సాయి ప్రత్యూష ఢిల్లీ యూనివర్సిటీలో బిఏ (హానర్స్) చదివారు. చిత్తూరు జిల్లాలో పంచాయతీ సెక్రటరీగా పనిచేసిన ఆమె గ్రూప్-1కు ఎంపికై ఆర్‌డిఒ కేడర్‌లో శిక్షణ పొందారు. వీరిని జిల్లా కలెక్టర్ అభినందించారు.

టెక్కలి సబ్ కలెక్టర్ కార్యాలయానికి 95వ అధికారిగా మడక కృష్ణమూర్తి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఇప్పటి వరకు ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా పనిచేసిన సుదర్శనదొర కలెక్టరేట్‌కు బదిలీ అయ్యారు. నూతనంగా బాధ్యతలను స్వీకరించిన కృష్ణమూర్తికి సిబ్బంది పుష్పగుచ్ఛాలను అందజేసి స్వాగతం పలికారు. ఈయనకు విజయనగరం జిల్లా రాంభద్రాపురం మండలం భుసాయవలస. తండ్రి రామారావు వ్యవసాయ కూలీ. ప్రాథమిక విద్యాభ్యాసం బొబ్బిలి రంగరాయపురం ప్రభుత్వ పాఠశాలలో పూర్తి చేశారు. ఇంటర్, బిటెక్, ఎంటెక్ విజయనగరంలో చదివారు. విజయవాడలో ప్రొ డిప్యూటీ కలక్టర్‌గా శిక్షణ పొందారు. మెట్టమెదట టెక్కలి ఆర్‌డిఒగా నియమితులయ్యారు.


కలెక్టర్‌ను కలిసిన ఆర్‌డిఒలు

సొంత భవనం మంజూరు చేయాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్థానిక విద్యాశాఖకు సొంత భవనం మంజూరు చేయాలని ఎంఇఒలు సిహెచ్.గోవిందరావు, ఎల్.వి.ప్రతాప్, ఉపాధ్యాయులు కోరారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్‌లోని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత కొంత కాలంగా స్థానిక విద్యాశాఖ వివిధ ప్రభుత్వ కార్యాలయాల పంచన కాలం వెలదీస్తున్నామని అన్నారు. తమకు వచ్చిన పుస్తకాలు, ఇతర సామగ్రి భద్రపరిచేందుకు అవకాశం లేకుండా పోయిందన్నారు. అన్నీ ఒకే గదిలో నిల్వ చేసుకోవడం వల్ల ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. గతంలో కూడా తమకు సొంత భవనం నిర్మాణానికి హామీ ఇచ్చారని, అయితే ఎన్నికల కోడ్ రావడంతో అది కాస్త మరుగున పడిందని, ఎప్పటికైనా తమరు స్పందించి విద్యాశాఖకు సొంత భవనం మంజూరు చేయాలని వారు కోరారు. అందుకుగాను మంత్రి సానుకూలంగా స్పందించి భావన నిర్మాణానికి హామీ ఇచ్చారు కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘ నాయకులు గొండు నారాయణరావు. వై.వాసుదేవ రావు, డి.కమలాబాయి, సామ సంజీవరావు, ఎస్.మురళి, మన్మథరావు, చందు పాల్గొన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న ఎంఇఒలు

ఈ-పంట నమోదు తప్పనిసరి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ఆమదాలవలస: ఈ-పంట నమోదు, ఇకెవైసి కార్యక్రమాన్ని రైతులు విధిగా చేయించుకోవాలని, ఆరోగ్యవంతమైన, నాణ్యమైన పంటలను పండించే దిశగా వారిని వ్యవసాయ అధికారులు కూడా ప్రోత్సహించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సూచించారు. మండలంలోని తోటాడలో ఖరీఫ్ వరికి ఈ పంట నమోదు కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన సర్వే నంబర్లలోని వరి పంట పొలాలను శనివారం పరిశీలించారు. గ్రామంలోని పలువురు రైతుల పొ లాలను స్వయంగా పరిశీలించి ఈ-పంట నమో దుతో సరిపోల్చి, సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం గ్రామ వ్యవసాయ సహాయకుల పనితీరు, రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అందుతున్న ఎరువులు, విత్తనాలు, ఇతర సేవలపై ఆరా తీశారు. ఇకెవైసి నమోదులోని లోటుపాట్లు గురించి అడిగి తెలుసుకుని రైతులకు, వ్యవసాయ శాఖ అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. డ్రోన్ల సహాయంతో ఈ కార్యక్రమాన్ని కలెక్టర్ స్వయంగా పరిశీలించారు. పంటల బీమా సహా నష్టపరిహారం, గిట్టుబాటు ధర, పిఎం కిసాన్, అన్నదాత వంటి పథకాలన్నీ ఈ పంట నమోదుతోనే ముడిపడి ఉన్నాయని, అందుకే ప్రతి రైతూ తాము సాగు చేస్తున్న పంటలను ఈ-పంట ద్వారా తప్పని సరిగా నమోదు చేసుకోవాలన్నారు. తద్వారా రైతులకు ప్రభుత్వ పథకాలన్నీ అందుతాయని స్పష్టం చేశారు. ఈ పరిశీలనకు వ్యవసాయశాఖ జిల్లా అధికారి కోరాడ త్రినాథస్వామి, అసిస్టెంట్ డైరెక్టర్ రజిని, మండల అగ్రికల్చర్ ఆఫీసర్ మెట్ట మోహన రావు, విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సుధీర్, పలువురు సర్వేయర్లు, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా ధాన్యం సేకరణ

జెసి ఫర్మాన్ అహ్మద్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో 2024-25 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్ కు సంబంధించి ధాన్యం సేకరణ ప్రణాళికా బద్ధంగా నిర్వహించాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు అనుసరించాల్సిన విధి విధానాలపై వివిధ శాఖల అధికారులతో శనివారం ం సమావేశం నిర్వహించారు. జిల్లాలో సాగు విస్తీర్ణం, దిగుబడి అంచనా, ధాన్యం సేకరణ కేంద్రాలు, సిఎంఆర్ రైస్, కనీస మద్దతు ధర వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో దాదాపు 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా ఉందన్నారు. స్థానిక వినియోగం నిమిత్తం 1.04 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, ఈ-పంట, ఇకెవైసి ఆధారంగా దాదాపు 5 లక్షల మెట్రిక్ టన్నుల సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్టు వివరించారు. అవసరమైన మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 2024-25 ఖరీఫ్ సీజన్‌లో గ్రేడ్-ఎ రకం ధాన్యం క్వింటాకు రూ.2,320 (75 కేజీలకు రూ.1,725)లుగా రాష్ట్ర ప్రభుత్వం మద్దతు ధరలను నిర్ణయించినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటి వరకు ఈ-పంట 3,59,616 ఎకరాలు నమోదైందని, ఇకెవైసి 3,26,521 ఎకరాలకు పూర్తయిందని తెలిపారు. ఇకెవైసిలో రాష్ట్ర సగటును చేరుకోని మండలాలు రెండు రోజుల్లో నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో శ్రీకాకుళం, టెక్కలి ఆర్‌డిఒలు కె.సాయిప్రత్యూష, ఎం.కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి కోరాడ త్రినాథస్వామి, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.సూర్యప్రకాశరావు, పౌరసరఫరాలశాఖ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జెసి ఫర్మాన్ అహ్మద్

పాలకుల విజనే వేరు...



ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మరోసారి స్వర్ణాంధ్ర 2047 నినాదాన్ని ఎత్తుకుంది. జిల్లాలో ఇటీవల కాలంలో స్వరాంధ్ర 2047 విజన్ పేరుతో అధికార యంత్రాంగం విస్తృతంగా సమావేశాలు, వర్క్‌షాపులను నిర్వహిస్తోంది. అందులో భాగంగా జిల్లా అభివృద్ధి ప్రణాళికపై ఒక విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించేందుకు ప్రజలు సలహాలు, సూచనలు ఇవ్వాలంటూ అధికారులు అడుగుతున్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నాలుగో తేదీన నిర్వహించిన అభిప్రాయ సేకరణకు వ్యవసాయ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుతో సహా అందరూ జిల్లాకు చెందిన కూటమి ప్రజాప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వెలిబుచ్చారు. 2020 విజన్ డాక్యుమెంట్ ప్రకారమే చంద్రబాబు అప్పట్లో హైదరాబాద్‌ను అభివృద్ధి చేశారంటూ మంత్రి కీర్తించారు. విభజన తర్వాత రాష్ట్రాన్ని, జిల్లాను స్వర్ణాంధ్రమయం చేస్తామంటూ 2014లో టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత బాబు చెప్పిన మాటలను మంత్రి మరిచినట్లు ఉన్నారు. జిల్లాను సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలతో రూపొందించిన అప్పటి టిడిపి ప్రభుత్వం రూపొందించిన 2011-19 డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్ ఇప్పుడు ఏమైందో తెలియదు. అందులో ఒక్కటి అమలు కాలేదు. విభజిత రాష్ట్రాన్ని 2029 నాటికి అభివృద్ధి చేస్తామని అందులో భాగంగా 2022 నాటికి దేశంలో మొదటి మూడు రాష్ట్రాల్లో ఎపిని నిలపాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. 2029 కల్లా ఉత్తమ రాష్ట్రంగా, 2050 వచ్చే సరికి ఎపిని అన్ని రంగాల్లో అగ్రగామి నిలుపుతామని విజన్ ప్లాన్ డాక్యుమెంట్‌లో ముందుమాటగా పేర్కొన్నారు. ఇప్పుడు అవన్నీ అటకెక్కాయి. ప్రణాళికలు మారిపోయాయి. జిల్లాకు వెనుకబడిన ప్రాంతంగా ఉన్న పేరును తొలగించేందుకు అన్ని వనరులను వినియోగించుకొని అగ్రగామిగా నిలుపుతామని ఉద్ఘాటించారు. జిల్లా ప్రజలు ఇది విని వినీ విసిగెత్తిపోయారు. వంశధార, ఆఫ్‌షోర్, వంశధార, నాగావళి అనుసంధాన పనులు తదితర సాగునీటి ప్రాజెక్టులు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉండిపోయాయి. వాటిని ఆదాయ వనరుగానే చూస్తున్నారు తప్ప సత్వరం పూర్తి చేసి సాగు నీరందించాలన్న ఆలోచన ఏ కోశానా కనిపించడం లేదు.

జిల్లా ప్రజలు కోరుకుంటున్న అభివృద్ధికి పాలకులు ఇప్పటివరకు అమలు చేసిన ప్రణాళికలకు పొంతనే లేకుండాపోయింది. చేపలవేట సక్రమంగా లేక జిల్లా నుంచి వేలాది మంది మత్స్యకారులు గుజరాత్, చెన్నయ్, ముంబాయి, కేరళ వంటి రాష్ట్రాలకు వలస వెళ్లిపోయారు. మత్స్యకారులు చేపలను నిల్వ చేసుకునేందుకు కనీసం కోల్డ్‌స్టోరేజీని నిర్మించలేకపోయారు. బుడగట్లపాలెం, మంచినీళ్లపేటలో ఫిషింగ్ హార్బర్లు నిర్మిస్తామంటూ పదేళ్లుగా ఊరిస్తూనే ఉన్నారు. వీటిని ఎప్పుడు పూర్తి చేస్తారో నిర్దిష్ట తేదీ చెప్పని మంత్రి మూలపేట పోర్టుకు వచ్చే జూన్ 12 నాటికి ఒక షిప్ వచ్చేలా ప్లాన్ చేస్తున్నామని చెప్తున్నారు. జిల్లాలో సుదీర్ఘంగా ఉన్న సముద్ర తీరం, పైడిభీమవరం నుంచి ఉన్న జాతీయ రహదారి, జిల్లాలో పుష్కలంగా ఉన్న నీటి వనరులను ఉపయోగించే ప్రణాళికలను చేయకుండా భోగాపురం నుంచి మూలపేట పోర్టు వరకు సముద్ర తీరానికి ఆనుకుని జాతీయ రహదారిని ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామని చెప్పటం వెనుక ప్రభుత్వానికి వేరే విజన్ ఉన్నట్లు కనిపిస్తోంది. అభివృద్ధి, జాతీయ రహదారి నిర్మాణం పేరుతో మత్స్యకార గ్రామాలను ఖాళీ చేసే ప్రణాళికలు అంతర్గతంగా ఏమైనా ఇమిడి ఉన్నాయా? అనే అనుమానాలు తలెత్తుతున్నాయి. జిల్లా ప్రజలు అడకపోయినా విమానాశ్రయం ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం చెప్తోంది. జిల్లా నుంచి ఎంత మంది ప్రయాణికులు ఉంటారు? వచ్చే ఆదాయం ఎంత ఉంటుందనే విషయాలను చూడటం లేదు. పోర్టు ప్రాంతానికి వచ్చే పెద్దల కోసం ఎయిర్‌పోర్టును నిర్మిస్తూ జిల్లా రూపమే మారిపోతుందన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. జిల్లాలో పర్యాటకాభివృద్ధికి ఉన్న అవకాశాలపై మరోసారి పాతే పాడుతున్నారు. అరసవల్లి, శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాలను కలుపుతూ టెంపుల్ టూరిజంపై అధికారులు 2014-19 కాలంలోనే ప్రణాళికలు రూపొందించినా నాటి టిడిపి ప్రభుత్వం ఒక్క పైసా ఇవ్వలేదు. ప్రతి మండలంలో పారిశ్రామిక పార్కు ఏర్పాటు చేస్తామని చెప్తున్నారు. పారిశ్రామిక పార్కు పేరుతో ప్రభుత్వ భూములను తమకు కావాల్సిన మనుషులకు అప్పగించే విజన్ అందులో దాగున్నట్లు కనిపిస్తోంది.

వికసిత్ ఆంధ్రప్రదేశ్ స్వర్ణాంధ్ర-2047 కోసం విద్యార్థులు, వ్యాపారవేత్తలు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు తమ అభిప్రాయాలను ఇప్పటికే స్వీకరించారు. వీరితో పాటు మేధావులు, ఆర్థిక నిపుణులు, అభ్యుదయ వాదులు, ఇతర రాజకీయ పార్టీలనూ భాగస్వామ్యం చేయాల్సి ఉంటుంది. అన్ని తరగతులనూ పిలిచి వారిలోనూ టిడిపి సానుభూతిపరులే ఉంటే ప్రజలకు ఒరిగేదేమీ ఉండదు. అందరి సలహాలు, సూచనలు తీసుకుని వారు ఆకాంక్షలకనుగుణంగా అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. జిల్లా అభివృద్ధికి సంబంధించి కొంత మంది మేధావులు, అభ్యుదయవాదులు గతంలో కొన్ని ప్రత్యామ్నయాలు సూచించారు. వాటిలో ఉద్దానం ప్రాంతంతో కొబ్బరి పరిశోధన కేంద్రం ఒకటి. దీనిని ఏర్పాటు చేస్తే రైతులకు కాస్తా మేలు కలుగుతుంది. ఉద్దాన ప్రాంతంలో కొబ్బరి పీచు పరిశ్రమల ఏర్పాటు, జీడి పరిశ్రమ అభివృద్ధికి బోర్డును ఏర్పాటు చేస్తే రైతుల కల నెరవేరుతుంది. భావనపాడు, కళింగపట్నం ఓడరేవులను అభివృద్ధి చేయడం ద్వారా మత్స్యకారులకు ప్రయోజనం కలగడంతో పాటు జిల్లా అభివృద్ధికి, ఉపాధి అవకాశాలకు పెరగడానికి దోహదపడుతుంది. కళింగపట్నం ఓడరేవును (శ్రీకాకుళం రోడ్) రైల్వేలైన్‌తో అనుసంధానిస్తే రవాణ వ్యవస్థ మెరుగుపడి, వ్యవసాయం, పరిశ్రమలకు ఊతం వస్తుంది. తద్వారా ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పెరిగే అవకాశముంది. ప్రజలు, ప్రభుత్వ ఆదాయం పెరిగి అంతిమంగా అది జిల్లా అర్థికాభివృద్ధికి దోహదపడుతుంది. ఇటువంటి ప్రత్యామ్నయాలు ఆలోచించకుండా జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామంటే గతంలో అటకెక్కిన 2014-19 విజన్ డాక్యుమెంట్ మాదిరిగా బుక్‌లెట్‌గానే ఉండిపోతుంది.


దుర్గాభవానికి చెక్కును అందజేస్తున్న ఎస్‌పి మహేశ్వర రెడ్డి

చెక్కు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇటీవల అనారోగ్యంతో మరణించిన హోంగార్డు సురేష్ కుటుంబానికి ఆర్థిక చేయూతగా సహచర హోంగార్డులు అందించిన ఒక్కరోజు గౌరవ వేతనం నగదు రూ.4.29 లక్షల చెక్కును జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి చేతులమీదుగా సురేష్ భార్య దుర్గాభవానికి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ హోంగార్డు సురేష్ మరణం చాలా బాధాకరమని, ఎటువంటి సమస్య అవసరం ఉన్న పోలీస్ శాఖ అండగా ఉంటుందన్నారు. విధులు నిర్వర్తిస్తూ మరణించిన, పదవీ విరమణ పొందిన హోంగార్డుల కుటుంబసభ్యులకు తోటి హోంగార్డులు ఇటువంటి సమయంలో ఆర్థిక చేయూతగా అండగా ఉండడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిఎస్‌పి వివేకానంద్, ఎఆర్ సిహెచ్. గోపినాథ్, రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, హోంగార్డు కుటుంబ సభ్యులు, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.


జూనియర్ కళాశాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్ తదితరులు

నెరవేరనున్న విద్యార్థుల కల

ప్రజాశక్తి- రణస్థలం రూరల్

ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న డిగ్రీ కళాశాల అంశం ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రత్యేక శ్రద్ధతో తీరనుంది. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ డిగ్రీ కళాశాల ప్రారంభించడానికి ఫీజుబిలిటీ సర్వే రిపోర్ట్ పంపించాలని శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ సురేఖని ఆదేశించడంతో శనివారం ఆమె స్థానిక ఎమ్మెల్యే ఈశ్వరరావుని కలిసి కొండములగాం జూనియర్ కళాశాలను పరిశీలించారు. మండల తహశీల్దార్ నందిగాం ప్రసాదరావు, సర్వేయర్ రవికుమార్ ఫీజిబిలిటీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కొత్త విద్యా సంవత్సరంలో క్లాసులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కాలేజ్ ప్రారంభించడానికి ముందడుగు పడేందుకు కృషి చేసిన ఎమ్మెల్యేకు ఈ సందర్భంగా మండల నాయకులు లంక శ్యామలరావు, పిన్నింటి బానోజీ నాయుడు, దన్నాన సత్తిబాబు, దన్నాన స్వామి నాయుడు, కాయత రమణ తదితరులు కృతజ్ఞతలు తెలిపారు.


అలకనందను అభినందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి- కవిటి

చదరంగం ఆటలో మరింత పరిణితిసాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటాలని ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆకాక్షించారు. మండలంలోని మండలం కొత్తపాలెం కెజిబివి పాఠశాలలో పదో తరగతి చదువుతున్న పొడియా అలకనంద రాష్ట్రస్థాయి చెస్ ఛాంపియన్ షిప్ పోటీలకు ఎంపికైన సందర్భంగా శనివారం తన క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక వికాశంతో పాటు జాతీయ స్థాయి గుర్తింపు లభిస్తుందని అన్నారు. అంతేకాకుండా మరింత మెరుగైన ప్రదర్శనతో రాష్ట్రస్థాయిలో ఉద్దానం ఖ్యాతి చాటాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు బెందాళం రమేష్, ఆరింగి మధు, బాసుదేవ్ ప్రధాన్, బెందాళం తిరుమల, వజ్జ రంగారావు పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- పాతపట్నం

ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. మండలంలోని పెద్దసీదిలో ఆజాద్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ మాట్లాడుతూ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నో ఏళ్ల నుంచి అనేక సేవా కార్యక్రమాలు చేపడుతుండడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ సందర్భంగా వెల్ఫేర్ అసోసియేషన్‌కు రూ.లక్ష విరాళం ప్రకటించారు. అలాగే సర్పంచ్ ప్రతినిధి జి.సూర్యం రూ.5 వేలు ప్రకటించారు. అధ్యక్షుడు శిమ్మ గణపతి, కోశాధికారి బోను దుర్గారావు, సభ్యులు గురివినాయుడు, బోను కృష్ణారావు, కంటుభుక్త రమణ, శంకర్, సర్పంచ్ ప్రతినిధులు ధనుంజయ్, బోను గిరి, గేదెల సూర్యం, ప్రసాద్, చిన్నాల విశ్వనాథం, జీవరత్నం పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి


పనులను పరిశీలిస్తున్న భారతీ దివ్య

ఇచ్ఛాపురం : మున్సిపాలిటీ పరిధిలోని ఫకీరుపేటలో నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్డు పనుల్లో స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్వహించిన మున్సిపల్ కౌన్సెల్ సాధారణ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ యు.భారతీ దివ్య ప్రస్తావించారు. ఫకీరుపేటరోడ్డు ప్రాంతంలో చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలు ఉన్నాయని, అందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై కమిషనర్ రమేష్ సూచనల మేరకు భారతీ దివ్య దగ్గర ఉండి స్పీడ్ బ్రేకర్ల పనులను శనివారం పరిశీలించారు. ఈమెతో మున్సిపల్ కాంట్రాక్టర్ నారాయణరెడ్డి, ఎర్రయ్య పాల్గొన్నారు.

చిన్నారికి రక్తదానం

శ్రీకాకుళం అర్బన్: గార మండలం అంపోలుకు చెందిన వి.రమణమూర్తి నాలుగేళ్ల చిన్నారికి ఎస్‌డిపిసి అందించి ప్రాణాలు నిలిపారు. అరసవల్లికి చెందిన పి.శివ ప్రసాద్ కుమార్తె నిరుపమ డెంగీ జ్వరంతో నగరంలో విజయ్ హర్ష తల్లి పిల్లల ఆస్పత్రిలో చేరింది. ప్లేట్‌లెట్స్ కౌంట్ పూర్తిగా తగ్గడంతో అత్యవసర పరిస్థితి నెలకొంది. అరుదైన రక్తనమూనా ఎ నెగెటివ్ ఎస్‌డిపి అవసరమవ్వడంతో దాతల కోసం ఎదురు చూశారు. మదర్స్ లవ్ ఫౌండేషన్ ఫౌండర్ సుప్రజ రౌత్‌ను సంప్రదించడంతో ఆమె సూచన మేరకు అత్యవసరంగా రమణమూర్తి రక్తదానం చేశారు. దీంతో ఆమె ప్రాణాలతో బయట పడిందని వైద్యులు తెలిపారు.

పంటల సాగు విధానం మారాలి

ప్రజాశక్తి- రణస్థలం

విచక్షణారహితమైన మానవ కార్యకలాపాలతో భూతాపం పెరిగి తద్వారా వాతావరణంలో పలు మార్పులు సంభవిస్తున్నాయని రణస్థలం డివిజన్ వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం బెంగళూరుకు చెందిన క్లైమ్స్, ఈక్విలిబ్రియం, వెర్రా సంస్థలు సంయుక్తంగా స్థానిక రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో నిర్వహించిన స్థానిక భాగస్వామ్య సంప్రదింపుల సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల సాగు విధానం మారాలని రైతులకు సూచించారు. సాంప్రదాయక వ్యవసాయ విధానాల ద్వారా వాతా వరణంలోకి అధిక కర్బన ఉద్గారాలు విడుదలవుతున్నాయని, వీటిని తగ్గించాలంటే తక్కువ నీటి వినియోగంతో సాగు చేస్తూ ఏడాది పొడవునా భూమిని కప్పి ఉంచేలా పంటలు సాగు చేయాలని విజయనగరం ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ కె.లక్ష్మణ్, సస్యపోషణ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.ఎం.వి శ్రీనివాసరావు రైతులకు సూచించారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా క్లైమ్స్, ఈక్విలిబ్రియం, వెర్రా వంటి పలు సంస్థలు కర్బన ఉద్గారాలు తగ్గించే దిశగా కృషి చేస్తూ, వ్యవసాయ విధానాల ద్వారా గ్రీన్‌హౌస్ వాయువులు తగ్గించే దిశగా సాగును అవలంభిస్తున్న రైతులకు కార్బన్ క్రెడిట్స్ రూపంలో ప్రోత్సాహకాలు అందించడానికి ముందుకు సాగు భారం అవుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో పరిశోధనా స్థానాల్లో నిరూపించబడిన అధునాతన సాంకేతిక పద్ధతులను అంది పుచ్చుకోవాలని వాతావరణ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త డాక్టర్ జి.చిట్టిబాబు అన్నారు. సిఫారసు మేరకు మాత్రమే పంటల్లో ఎరువులు, పురుగు మందులు వినియోగించాలని, అదనపు ఖర్చులు ఆదా అవడమే కాకుండా, వాతావరణ మార్పులు తగ్గించడానికి దోహద పడవచ్చన్నారు. ఏటా పంటల్లో పలు రకాల కొత్త పురుగులు, తెగుళ్ళ పంటలను ఆశిస్తూ అటు రైతాంగానికి, ఇటు శాస్త్రవేత్తలకు సవాలు విసురడానికి కారణం పెరుగుతున్న భూతాపమే కారణమని ఆముదాల వలస శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.కిరణ్ కుమార్ అన్నారు. దీన్ని తగ్గించే దిశగా భూమి మీద నివసించే ప్రతిఒక్కరూ వృక్ష సంపదను పెంపొందించేకు వ్యక్తి గతంగా కృషి చేయాలని రైతులకు సూచించారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తమ కార్బన్ ప్రాజెక్ట్‌లో భాగంగా పర్యావరణ ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి, వాతావరణ మార్పులను తగ్గించే దిశగా చిన్న కమతాల రైతులను ప్రోత్సహించడానికి జిల్లా రైతుల నమోదు కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని బెంగళూరుకు చెందిన క్లైమ్స్, ఈక్విలిబ్రియం సంస్థల ప్రతినిధులు పంకజ్, యష్ అన్నారు. ఈ ప్రాంతంలో రైతుల కోసం చేపడుతున్న తమ ప్రాజెక్ట్ నేలలో సేంద్రీయ కర్బన స్థాయిలు పెంచడం ద్వారా నేల ఆరోగ్యాన్ని మెరుగు పర్చడానికి స్థానిక రైతులను భాగస్వామ్యం చేస్తూ వారికి కార్బన్ క్రెడిట్స్ రూపంలో ప్రోత్సాహకాలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వాతావరణ, పర్యావరణ కార్యాచరణ ప్రతినిధి ఆర్. హరిబాబు, అభ్యుదయ రైతులు కండాపు ప్రసాదరావు, కలిశెట్టి ఆదినారాయణ, ఇప్పిలి రామ్మోహనరావు, పాండ్రంకి సింహాచలం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన పలు అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

చేపల పెంపకంతో రైతులకు ఆదాయం

ప్రజాశక్తి- ఆమదాలవలస

కార్పు జాతి చేపల పెంపకంతో రైతుల ఆదాయం పెంచుకోవచ్చని అనకాపల్లి పరిశోధనా స్థానం సహాయ సంచాలకులు సిహెచ్ ముకుందరావు అన్నారు. శనివారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో కార్పు జాతి చేపల పెంపకంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం, జాతీయ మత్స్య అభివృద్ధి మండలి సంయుక్తంగా జిల్లాలో ఉన్న చేపల రైతులకు, స్వదేశీ మత్స్యకారులకు చేపల పెంపకంపై ఉత్తమ యాజమాన్య పద్ధతులపై వృత్తి విద్యా శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న నీటి వనరుల్లో చేపల పెంపకం శాస్త్రీయ పద్ధతుల్లో చేపట్టడం ద్వారా ప్రస్తుతం ఉన్న దిగుబడులను రెట్టింపు చేసుకోవడానికి అవకాశం ఉందన్నారు. నీటి వనరులను సమర్థంగా


సమావేశంలో మాట్లాడుతున్న ముకుందరావు

వినియోగించుకోవడానికి వీలవుతుందని తెలిపారు. అనంతరం కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాల్లో వస్తున్న నూతన పద్ధతులను రైతులు అవగాహన చేసుకుంటూ శాస్త్రీయ యాజమాన్య విధానాలను పాటిస్తూ చేపల పెంపకం చేపడితే రైతులు అధిక ఆదాయాన్ని పొందవచ్చునన్నారు. దీంతో పాటు చేపలతో చేసుకోదగ్గ విలువ ఆధారిత ఉత్పత్తులపై కూడా దృష్టి సారిస్తే మార్కెటింగ్ సదుపాయాలు కూడా పెరుగుతాయని తెలిపారు. మత్స్య శాస్త్రవేత్త డాక్టర్ సిహెచ్ బాలకృష్ణ రైతులకు మంచినీటి చెరువుల్లో పెంచడానికి వీలయ్యే చేపల రకాలు, వాటి లక్షణాలు వివరించారు. దీంతో పాటు నీటి గుణాల యాజమాన్యం, మేత యాజమాన్యంపై వివరించారు. కమ్యూనిటీ, పంచాయతీ చెరువుల్లో కలుపు మొక్కల బెడద ఎక్కువగా ఉంటుంది కాబట్టి వాటి సమర్థ నిర్వహణ, యాజమాన్య అంశాలను వివరించారు. కార్యక్రమంలో భాగంగా తదుపరి రైతు క్షేత్రాలలో నైపుణ్య ప్రదక్షిణ క్షేత్రాలు కూడా నిర్వహిస్తామని రైతులు ఈ కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. మత్స్యశాఖ సహాయ సంచాలకులు వై.సత్యనారాయణ మాట్లాడుతూ మత్స్య రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటు విధి విధానాలను, మత్స్యశాఖ ద్వారా అమలవుతున్న పథకాలను వివరించారు. శిక్షణా కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు, స్వదేశీ మత్స్యకారులు, రైతులు పాల్గొన్నారు.

టిడిపి నాయకుని ఇంటిపై దాడి

ప్రజాశక్తి- పలాస

టిడిపి నాయకులు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి గాలి కృష్ణారావు ఇంటిపై శనివారం వేకువజాము 3 గంటల ప్రాంతంలో ఆయన ప్రత్యర్థులు రాళ్ల దాడికి దిగారు. ఈ సంఘటనలో ఆయన ఇంటి ముందు బ్యూటిఫికేషన్ కోసం ఏర్పాటు చేసిన చలువ అద్దాలు విరిగిపోగా, ఆయనకు చెందిన రెండు ద్విచక్రవాహనాలను సైతం కిందపడేసి బీభత్సం సృష్టించారు. ఈ మేరకు బాధితుడు తనకు న్యాయం చేయాలని, ప్రత్యర్థుల నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ కాశీబుగ్గ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. పలాస ఉదయపురం కాలనీలో దుర్గాపూజ సందర్భంగా శుక్రవారం రాత్రి డొక్కరి శంకర్, డొక్కరి సాయి, కోనారి గంగాధర్, తలగాన మోహన్ తనతో గొడవ పడ్డారని, వారే ఈ పనిచేసి ఉంటారనే అనుమానాన్ని వ్యక్తం చేశారు. వారి నుంచి రక్షణ కల్పించాలని కోరారు. దుర్గా మండపం వద్దకు తన బంధువైన శాసనంకు చెందిన కుప్పిలి మన్మధరావు వచ్చారని, ఆ సమయంలో కౌన్సిలర్ భర్త శంకరరావు బంధువును ప్రశ్నించారని, తానే రమ్మని పిలిచినట్లు తెలిపారు. దీనితో కౌన్సిలర్ భర్తతో పాటు ఆయన అనుచరులు తనతో వాదనకు దిగారని, వారితో గొడవ ఎందుకని తాను ఇంటికి వెళ్లిపోయానని వివరించారు. శనివారం వేకువజాము 3 గంటల సమయంలో ఇంట్లో రాయిపడినట్లు శబ్దం


పగిలిన ఇంటి అద్దాలు

రాగా, తాను బయటకు వచ్చి చూసేసరికి ఇంటి అద్దాలు విరిగిపోయి ఉన్నాయని, ద్విచక్రవాహనాలు కూడా కిందపడి ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దుర్గాప్రసాద్‌కు అభినందనలు

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలోని పద్మావతి జూనియర్, డిగ్రీ కళాశాల డైరెక్టర్ సిహెచ్.దుర్గా ప్రసాద్ డాక్టర్ అబ్దుల్ కలాం నేషనల్ ప్రతిభా అవార్డుకు ఎంపికయ్యారు. సదరన్ ప్రయివేటు లెక్షరర్లు, టీచర్స్ అసోసియేషన్ ఫౌండర్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య ఒక ప్రకటనలో అభినందనలు తెలిపారు. కళాశాలలో విద్యార్థులకు పాఠ్యాంశాల బోధనలోను, సేవా కార్యక్రమాల్లోను, క్రీడా రంగంలోను, విలువలతో కూడిన విద్య అందిస్తున్నందుకు ఈ అవార్డుకు ఎంపికయ్యారని అన్నారు. ఈ నెల 15న అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా గుంటూరులో అందజేస్తున్నట్లు తెలిపారు.

ఎపిఎంగా జాంబవతి

పలాస : వెలుగు ఎపిఎంగా కె.జాంబవతి శనివారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈమె నందిగాం మండలం వెలుగు ఎపిఎంగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. గతంలో పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో ఎపిఎంగా పని చేశారు. ఇప్పటి వరకు ఎపిఎంగా పనిచేసిన మల్లేశ్వరరావు శ్రీకాకుళం డిఆర్ డిఎకు బదిలీ అయ్యారు. జాంబవతికు మండల సిసిలు, సిఎఫ్‌లు అభినందనలు తెలిపారు.

విఆర్‌ఒల బదిలీ

టెక్కలి : టెక్కలి తహశీల్దార్ కార్యాలయం పరిధిలోని పలు పంచాయతీల్లో విధులు నిర్వర్తిస్తున్న విఆర్‌ఒలు బదిలీ అయ్యారు. గున్నకోటేశ్వరరావు, యుగంధర్, జనక మోహనరావులు మరలా టెక్కలి మండలానికి బదిలీపై వచ్చారు. 11 మంది విఆర్‌ఒలకు స్థానచలనం కలిగింది.

బాబూరావుకు సన్మానం

పలాస : ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావుకు టిడిపి నాయకులు, మెప్మా సిబ్బంది ఆయన స్వగృహంలో శనివారం దుశ్శాలువ కప్పి సన్మానించారు. ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎంపిక కావడంపై శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, డొక్కరి శంకర్, కొరికాన శంకర్ పాల్గొన్నారు.

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

టెక్కలి రూరల్ : టెక్కలి ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోకి వచ్చే టెక్కలి, నందిగాం, మెళియాపుట్టి మండలాల్లోని అన్ని మద్యం దుకాణాల ఎంపిక ప్రక్రియకు దరఖాస్తులు స్వీకరిస్తున్నామని సిఐ మేరా సాహిబ్ ప్రకటనలో తెలిపారు. ఎక్సైజ్ స్టేషన్‌లోని ఉదయం పది నుంచి సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ఈనెల 9న ఆఖరి తేదీ చెప్పారు. దరఖాస్తు చేసుకున్నవారు రూ.2 లక్షల అప్లికేషన్ ఫీజ్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. 11న ఉదయం 8 గంటల నుంచి శ్రీకాకుళం ఆర్ట్స్ కాలేజ్, అంబేద్కర్ ఆటోరియం ఎంపిక చేస్తారన్నారు.

తహశీల్దార్ బాధ్యతల స్వీకరణ

మందస: మందస మండలం నూతన తహశీల్దార్‌గా ఎస్.హైమావతి శనివారం బాధ్యతలు స్వీకరించారు ఈమె పలాస ఆర్‌డిఒ కార్యాలయంలో పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఆమె మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు కృషి చేస్తానని తెలిపారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

నరసన్నపేట: నరసన్నపేట పట్టణంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో సత్యసాయి యూనిటీ కప్ క్రికెట్ పోటీలను శనివారం ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలపైన ఆసక్తిని పెంపొందించు కోవాలన్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న సత్య సాయి ట్రస్టును అభినందించారు. నాయకులు, పాల్గొన్నారు.

ఎంపిడిఒగా వసంత కుమార్

పలాస: ఎంపిడిఒగా కె.వసంత కుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేట ఎంపిడిఒగా పనిచేస్తూ ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ ఎంపిడిఒగా పనిచేసిన ఎస్.రమేష్ నాయుడు వజ్రపుకొత్తూరు ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు.

వృత్తి విద్యా నైపుణ్యాలతో భవిష్యత్


టైలరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న జిసిడిఒ నీరజ

ప్రజాశక్తి- పొందూరు

వృత్తివిద్యా నైపుణ్యాలను పెంపొందించు కోవడం ద్వారా విద్యార్థులు తమ భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చునని జిసిడిఒ నీరజ అన్నారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు సమగ్ర శిక్షాఅభియాన్ ద్వారా నిర్వహిస్తున్న లెర్న్ నెట్ స్కిల్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఇంటర్న్‌షిప్ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు ద్వారకామయి టైలరింగ్ శిక్షణా సంస్థ అందిస్తున్న టైలరింగ్ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. అలాగే కుందూరులో టెక్నో కంప్యూటర్ సెంటర్‌లో ఎపి మోడల్ స్కూల్ 10వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ఐటి, ఐటిఇఎస్ ట్రేడ్ ఇంటర్న్ షిప్ ప్రోగ్రాంను జిసిడిఒ పరిశీలించారు. కార్యక్రమంలో వృత్తివిద్యా సమన్వయకర్త బి.తిరుపతిరావు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.వెంకటరావు, టైలరింగ్ సంస్థ నిర్వాహకులు బి.విజయకుమారి, విజయలక్ష్మి, సుధారాణి, ప్రిన్సిపాల్ ప్రభాకర్, ఉపాధ్యాయులు మంగమ్మ, మాలతి పాల్గొన్నారు.

మహిళకు ఆర్థికసాయం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నిరుపేద మహిళ వైద్యానికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ (ఎస్ఎస్ఎస్), ఏలియన్స్ క్లబ్ మిత్ర ద్వారా రూ.32 వేలతో పాటు, కర్లాన్ పరుపు, రైస్ ప్యాకెట్, నిత్యావసర సరుకులను అందించి మానవత్వం చాటుకున్నారు. స్థానిక బలగ మడ్డి వీధిలో నివసిస్తున్న కలివరపు సుశీల, భర్త వెంకటరావు కరోనాలో చనిపోయారు. మూడో కుమార్తె ఊబకాయంతో పాటు థైరాయిడ్ వంటి ఆరోగ్య సమస్యలతో ఇంటి వద్దనే నిస్సహాయురాలుగా ఉంటుందని, తల్లి సుశీల కీళ్ల సమస్యలు వచ్చి నడవలేక, కుటుంబం గడవలేని పరిస్థితిలో ఉన్నారనే విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్నామని, స్మాల్ సర్వీస్ టు సొసైటీ మిత్రులు, దాతల సహాయంతో శనివారం బాధిత కుటుంబ సభ్యులకు అందించి మాట్లాడుతూ వీరి ఆర్థిక పరిస్థితి బాగోలేని కారణంగా తమవంతు సాయాన్ని అందించామని, మనసున్న దాతలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనతో విజ్ఞానం


చేపల చెరువును పరిశీలిస్తున్న విద్యార్థులు

టెక్కలి: కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు పుస్తకాల్లోని చదువులతో పాటు క్షేత్రస్థాయి పర్యటనల ద్వారా విజ్ఞానాన్ని పొందవచ్చునని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ తెంబురు గోవిందమ్మ అన్నారు. కళాశాలలో బిఎస్‌సి తృతీయ సంవత్సరం చదువుతున్న జువాలజీ విభాగానికి చెందిన విద్యార్థులు శనివారం మండలంలోని లింగాలవలసలోని చేపల చెరువులు, సందర్శించారు. చేపల పెంపకం ద్వారా ఆర్థికంగా మెరుగుపడవచ్చునని అన్నారు. ఈ పర్యటనలో భాగంగా చేపల చెరువులను సందర్శించి పెంపకంలో ఉన్న మెళకువలను, పెంచే విధానాన్ని విద్యార్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. జన్యు రుగ్మతలతో కూడిన బాధితులను కలిసి జన్యు సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బేపల సతీష్‌కుమార్, ఐ క్యూ కో-ఆర్డినేటర్ వి.లూక్‌పాల్, జువాలజీ విభాగం అధిపతి ఎన్.హెచ్.కె.జనార్ధన్, చౌదరి, సుగుణానందరావు, ఎస్.శివాజీ పాల్గొన్నారు.

వరద బాధితులకు చేయూత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విజయవాడ ఆర్‌టిసి పరిధిలో పనిచేస్తున్న 80 మందికి పైగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు బుడమేరు వరదల్లో నిరాశ్రయులయ్యారని తెలిసి తోటి కార్మికులను ఆదుకోవాలన్న లక్ష్యంతో ఎపిటిడి, ఆర్‌టిసి ఔట్‌సోర్సింగ్ కార్మికుల అసోసియేషన్ తరుపున జిల్లా నుంచి నిత్యావసర సరకులను పంపించారు. శనివారం జిల్లా ప్రజా రవాణాధికారి ఎ.విజయ్ కుమార్ చేతులమీదుగా వాహనాన్ని పంపించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్లు అమరసింహుడు, శర్మ, రమేష్, పిఆర్‌ఒ సుమన్, ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీ, జిల్లా అధ్యక్షులు


బాధితులకు నిత్యావసర సరుకులు పంపిస్తున్న అధికారులు

రమణ, సెక్రెటరీ త్రినాధ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘ అధ్యక్షులు శర్మ, అప్పారావు, బాబూరావు, ఔట్‌సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు టి.ముత్యాలరావు, జిల్లా అధ్యక్షులు డి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో సాంకేతిక పనిముట్లు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వ్యవసాయ రంగానికి ఊత మందించే లక్ష్యంతో జిల్లాలో సాంకేతికంగా అభివృద్ధి చేయాలన్న ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా రైతులకు వ్యవసాయ పనిముట్లు అందుబాటులోకి తీసుకు వచ్చామని వినాయక అగ్రో ఇండస్ట్రీ ఎమ్‌డి విజయకుమార్ తెలిపారు. నగరంలోని పెద్దపాడు రోడ్డులో ఉన్న వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్‌లో అతి తక్కువ ధరలో రైతుకు కావాల్సిన అన్ని రకాల వ్యవసాయ యంత్రాలు, యంత్ర పరికరాలు, మెకానిక్ సర్వీసు హోల్‌సేల్ రేట్లులో అందిస్తున్నట్టు తెలిపారు. పవర్ వీడర్స్ వాటి స్పేర్‌పార్ట్స్, కోత మిషన్లు వాటి స్పేర్ పార్టులు, పవర్ టిల్లర్స్, స్పేర్ పార్ట్స్, బ్రష్ కటర్స్, ట్రాక్టర్ రోటో వేటర్స్, విడిభాగాలు, పవర్ స్పేయర్స్ విడిభాగాలు, బ్యాటరీ స్పేయర్స్, గుంతలు తీయు యంత్రం, ఎర్త్ ఆగర్స్, పెట్రోల్ అండ్ డీజిల్ ఇంజన్లు,



పెద్దపాడు రోడ్డులో ఉన్న ఆగ్రో ఇండస్ట్రీ

ఛాఫ్ కట్టర్స్, పాలు తీయు యంత్రాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మరిన్ని వివరాలకు వినాయక ఆగ్రో ఇండస్ట్రీస్, 8096695809 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. దసరా ఆఫర్ రూ.6వేలు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సౌకర్యాన్ని సద్వినియోగ పర్చుకోవాలన్నారు.

పుస్తెలతాడు అపహరణ

పలాస: పలాసలో దొంగలు రెచ్చిపోతున్నారు. మిట్ట మధ్యాహ్నం ఓ దొంగ స్థానిక సీతమ్మతల్లి మార్కెట్ ఎదురుగా నివాసం ఉంటున్న సాన కళావతి ఇంట్లోకి చొరబడి ఆమె మెడలో ఉన్న 110 గ్రాముల (రూ.8 లక్షల విలువైనవి) బంగారు ఆభరణాలు దొంగిలించి ఉడాయించాడు. దీన్ని ప్రతిఘటించిన ఆమె సోదరి వరహాలమ్మపైన కూడా తన ప్రతాపాన్ని చూపించడంతో ఆమె కేకలు వేయడంతో దొంగ పరారీ అయ్యాడు. బాధితులు కథనం మేరకు... సీతమ్మతల్లి కూరగాయల మార్కెట్ ఎదురుగా ఆర్‌టిసి డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్యామసుందరరావు, కళావతి దంపతులు నివాసం ఉంటున్నారు. శనివారం కూరగాయల మార్కెట్ సెలవుదినం కావడంతో ఆ ప్రాంతంలో మధ్యాహ్నం పూట జనసంచారం తక్కువగా ఉంటుంది. అదే అదునుగా చేసుకున్నాడు వ్యక్తి. ఉంగరాల జుత్తు కలిగిన ఓ బలమైన యువకుడు ఒకరు ఒక అడ్రాస్ చెప్పాలని ఆమెను కోరాడు. నేరుగా ఇంటికి ఎందుకు వస్తున్నారని ఆమె ప్రశ్నించేంత లోపే తలుపులు తీసి చొరబడ్డాడు. ఆమె మెడలో ఉన్న బంగారు ఆభరణాలు తస్కరించాడు. దీన్ని గుర్తించిన వరహాలమ్మ ఎవరని ప్రశ్నించి అక్కడకు వచ్చే సరికి ఆమెపైనా దాడి చేసేందుకు ప్రయత్నించగా ఆమె ప్రతిఘటించింది. ఇంతలో కేకలు వేయగా దొంగ దొరికిన బంగారంతో పరారయ్యాడు. 110 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు తెలిపింది. ఈ విషయం భర్త శ్యామ సుందరరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ పోలీసులు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ డి.మోహనరావు తెలిపారు.

హుండీ చోరీ

పలాస: పలాస లేబర్ కాలనీలో దుర్గా నవరాత్రి ఉత్సవాల మండపం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. అందులో యాత్రికులు కానుకలు వేసిన రూ.70 వేలు నగదు ఉంటుందని ఉత్సవ కమిటీ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం అర్ధరాత్రి దాటిన తరువాత మండపంలోకి దొంగలు చొరబడి హుండీని ఎత్తుకెళ్లారు. అందులో ఉన్న నగదు దొంగిలించి హుండీని సమీప పొదల్లో పడేశారు. సంఘటన స్థలానికి కాశీబుగ్గ సిఐ డి.మోహనరావు చేరుకొని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అభివృద్ధి పనులకు నిధుల మంజూరు

ప్రజాశక్తి- ఆమదాలవలస

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరైనట్లు టిడిపి కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని ఆమదాలవలస, సరుబుజ్జిలి, పొందూరు, బూర్జ మండలాల్లో ఉపాధిహామీ గ్రామీణ నీటి సరఫరా విభాగం ఆధ్వర్యంలో 79 పనులకు రూ.755.50 లక్షలు నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులు మంజూరుకు సహకరించిన సిఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కు ఎమ్మెల్యే కూన రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

తమ్మినేనిని కలిసిన కృష్ణచైతన్య

ఆమదాలవలస: వైసిపి జిల్లా పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకులుగా నియమితులైన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంను నరసన్నపేట జెడ్‌పిటిసి ధర్మాన కృష్ణచైతన్య శనివారం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా సీతారాంకు పుష్ప గుచ్ఛం అందజేసి శాలువతో సత్కరించారు. పార్టీ బలోపేతంపై కాసేపు ముచ్చటించారు. కార్యక్రమంలో ఎంపిపిలు ఆరంగి మురళీ, వాన గోపి, జెడ్‌పిటిసి చింతు రామారావు, సుడా మాజీ చైర్మన్ కెసిహెచ్ గుప్తా, జెసిఎస్ కన్వీనర్లు ధర్మాన జగన్, సురంగి నర్సింగరావు, సర్పంచులు కొండల బాబూరావు, సిరిసిల్ల తేజేశ్వరరావు పాల్గొన్నారు.

డిటిలుగా బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి- లావేరు

మండల రెవిన్యూ కార్యాలయ ఉప తహశీల్దార్‌గా డబ్బీరు శ్రీనువాసరావు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన శ్రీకాకులం ఎల్‌ఎ యూనిట్-4లో డిటిగా పనిచేస్తూ లావేరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు తీసుకున్న డిటికి కార్యాలయ సిబ్బంది పుష్ప గుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే రీసర్వే డిప్యూటీ తహశీల్దార్‌గా ఎన్. తిరుపతిరావు బాధ్యతలు చేపట్టారు. ఈయన జలుమూరు మండల రీసర్వే డిటిగా పనిచేసి ఇక్కడకు వచ్చారు.

సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండల నూతన డిప్యూటీ తహశీల్దార్గఆ కె.నారాయణరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణరావు పలాస ఆర్‌డిఒ కార్యాలయం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు పనిచేసిన డిటి ప్రవీణ్ కుమార్ కోటబొమ్మాళి బదిలీపై వెళ్లారు. అలాగే మండల సర్వేయర్‌గా డి.సుభాష్ బాధ్యతలు చేపట్టారు. సుభాష్ వజ్రపుకొత్తూరు మండలం ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిబ్బంది స్వాగతం పలికారు.

మంత్రి దృష్టికి ఇచ్ఛాపురం సమస్యలు

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి, వార్డు కౌన్సిలర్ ఆశి లీలారాణి కోరారు. ఈ మేరకు కోటబొమ్మాళి మండలం నిమ్మాడలోని మంత్రి క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు ఆసి చిరంజీవులు రెడ్డి, ఆశి మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతతో పనిచేయాలి

పాతపట్నం: పాతపట్నం మండల పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన వానపల్లి రామారావు, ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చీపురు కృష్ణారావు, ఎస్ఐగా శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావును ఆయన క్యాంపు కార్యాలయంలో శనివారం మర్యాదపూర్వకంగా వెళ్లి కలిశారు.

నేత్ర వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని బట్టివాని పాలెంలో వీర బ్రహ్మేంద్రస్వామి గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యాన శనివారం ఉచిత నేత్ర, వైద్య శిబిరం నిర్వహించారు. రాగోలు జెమ్స్ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో 250 మంది రోగులకు ఉచితంగా నేత్ర, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. తీవ్రమైన వ్యాధులతో బాధపడుతున్న వారిని గుర్తించి జెమ్స్‌కు చికిత్స ఉచితంగా చికిత్స అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యుడు, మెడికల్ క్యాంపు ఆర్గనైజర్ చీకటి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు ఎరిపిల్లి దుర్వాసులు, ఆవాల కేశవరావు, చీకటి హేమంతరావు, జల్లి కామయ్య, చీకటి సుందరరావు, చీకటి పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.